
బొల్లారం: నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ రోజాబాల్ రెడ్డి, తదితరులు


అమీన్‌పూర్: నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి


సిర్గాపూర్: నినాదాలు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


సంగారెడ్డి కలెక్టరేట్: తారా ప్రభుత్వ కళాశాలలో..


సంగారెడ్డి: నివాళులర్పించిన బీఆర్‌ఎస్ నాయకులు

## సార్ యాదిలో..

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించడంలో ఉద్యమకారుల్లో స్ఫూర్తినింపిన పోరాటయోధుడు, తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతిని జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తొలిదశ ఉద్యమానికి ఊపిరిగా.. మలిదశ ఉద్యమానికి దిక్సూచిగా నిలబడ్డారని ఆయన సేవలను గుర్తు చేశారు. జయశంకర్ సార్ ఆశయ సాధనకు యువత ముందుకు సాగాలన్నారు. ఆయన కన్న కలల బంగారు తెలంగాణ సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. తెలంగాణ ప్రజానీకం ఎప్పటికీ జయశంకర్ త్యాగాన్ని మర్చిపోదన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు.

*- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, ఆగస్టు 6*


నారాయణఖేడ్: పూలమాల వేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి


అందోల్: జోగిపేటలో..


కోహీర్: నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


రామచంద్రాపురం: నివాళులర్పించిన కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి


న్యాల్‌కల్: బసంపూర్ జయశంకర్ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో..

## పాపం పసివారు

### బస్టాండ్‌లో వదిలిన కన్నవారు



పోలీసుల వద్ద ఇద్దరు చిన్నారులు

పటాన్‌చెరు, ఆగస్టు 6: ఇద్దరు పసి పిల్లలను పటాన్‌చెరు బస్టాండ్‌లో కన్నవారు వదిలేసి వెళ్లారు. సోమవారం సాయంత్రం సమయంలో మాటలు కూడా సరిగ్గా రాని రెండేళ్ల బాబు, ఎనిమిది నెలల పాపను బస్టాండ్‌లో ఆర్టీసీ స్వీపర్ చూసింది. కన్నవారు దగ్గరలోనే ఉన్నారని భావించి పట్టించుకోలేదు. ఎంతసేపైనా ఎవరూ రాకపోవడంతో వారి గురించి బస్టాండ్‌లో, ఆ పరిసరాల్లో ఆరా తీసింది. ఎవరూ గుర్తు పట్టకపోవడంతో స్వీపర్ వారిని తనవద్దే పెట్టుకున్నది. ఈ విషయాన్ని గమనించిన మీడియా పటాన్‌చెరు పోలీసులకు సమాచారం ఇచ్చింది. స్వీపర్ సంరక్షణలో ఉన్న ఇద్దరు చిన్నారులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వారికి ఆహారం, ఇతర సపర్యలను పోలీసులు చేశారు. ఐసీడీఎస్ అధికారులను సంప్రదించి వారికి పిల్లలను అప్పగించారు. పిల్లలను గుర్తించిన వారు పటాన్‌చెరు పోలీసులను సంప్రదించాలని పటాన్‌చెరు సీఐ ప్రవీణ్‌రెడ్డి కోరారు.

## కాల్వ పనుల పరిశీలన

కల్హేర్, ఆగస్టు 6: నల్లవాగు ప్రాజెక్టు కుడి కాల్వ మొదటి విడత నిర్మాణ పనులు, నాణ్యతను ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్ ధర్మ పరిశీలించారు. గత ప్రభుత్వంలో మంజూరైన రూ.24 కోట్లతో కాల్వ ఆధునీకరణ పనులు చేపట్టారు. పనుల తీరుపై ఆరా తీశారు. ఎస్‌ఈ ఏసయ్య, ఈఈ జైభీమ్, డీఈలు పవన్‌కుమార్, విజయ భాస్కర్, ఏఈలు రవి, సూర్యకాంత్ ఉన్నారు.

**'కాకివాగు' చెరువు పరిశీలన**

కంగ్టి, ఆగస్టు 6: దామరిగిద్ద కాకివాగు చెరువును సీఈ ధర్మ సందర్శించారు. చెరువుకట్ట, తూములు, కుడి, ఎడమ కాల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా చివరి వరకు నీళ్లు రావడం లేదని ఆయకట్టు రైతులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఎస్‌ఈ ఏసయ్య, ఈఈ భీమ్, డీఈ విజయ్ భాస్కర్, ఏఈ రవి ఉన్నారు.

## 'తారా'లో జిల్లా స్థాయి వక్తృత్వ పోటీలు

సంగారెడ్డి కలెక్టరేట్, ఆగస్టు 6: జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం తారా ప్రభుత్వ కళాశాలలో జిల్లా స్థాయి వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఈ నెల 7న కలెక్టరేట్‌లో బహుమతులు అందజేస్తామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్‌ఎస్ రత్నప్రసాద్ తెలిపారు. ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు, అధ్యాపకులు డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ సదయ్య, డాక్టర్ జోత్స్న, డాక్టర్ వాణి పాల్గొన్నారు.

## భూ సర్వేకు సహకరించాలి

సదాశివపేట, ఆగస్టు 6: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ట్రిపుల్ ఆర్ భూ సర్వేకు సహకరించాలని ఆర్డీవో వసంతకుమారి కోరారు. మంగళవారం మండల పరిధిలోని పెద్దాపూర్, కొండాపూర్, మండలంలోని గిర్మాపూర్ గ్రామస్తులతో పెద్దాపూర్ రైతు వేదికలో అభిప్రాయ సేకరణ చేపట్టారు.

## పౌష్టికాహారం అందించాలి

సంగారెడ్డి, ఆగస్టు 6: మహాత్మా జ్యోతిరావు పూలే వెనుకబడిన తరగతుల బాలుర పాఠశాల, వసతి గృహంలో విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని పాఠశాలను తనిఖీ చేసి వసతిగృహంలో పిల్లలకు వడ్డిస్తున్న భోజనం, వంటగది, మరుగుదొడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ర్యాగింగ్, చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆటో బోల్తా : ఇద్దరు మృతి

హత్నూర, ఆగస్టు 6: ఆటో బోల్తాపడి ఇద్దరు మృతి చెందిన ఘటన హత్నూర మండలం తుర్కలఖానాపూర్ శివారులో చోటుచేసుకుంది. మంగళవారం హత్నూర పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు మండలం పెద్దకంజర్లకు చెందిన గొల్ల మల్లేశం(47) తన ఆటోలో సోమవారం రాత్రి తిమ్మాపూర్ నుంచి ఇంటికి వెళ్తుండగా తుర్కలఖానాపూర్ శివారులోకి చేరుకోగానే అదుపుతప్పి ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ మల్లేశంతోపాటు అందులో ప్రయాణిస్తున్న దౌల్తాబాద్ గ్రామానికి చెందిన యూసుఫ్ (51) అక్కడికక్కడే మృతి చెందారు. గొల్ల మల్లేశానికి భార్య, కూతురు, కుమారుడు ఉండగా యూసుఫ్‌కు ముగ్గురు కూతుళ్లు, కుమారుడు, భార్య ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నారు.

## రసాయన వ్యర్థాల నీరు తాగి ఆవు మృతి

జిన్నారం, ఆగస్టు 6: ఖాజీపల్లి గ్రామంలో రసాయన వ్యర్థాలు కలిసిన నీటిని తాగి హకీమ్‌కు చెందిన ఆవు సోమవారం రాత్రి మృతి చెందింది. మంగళవారం హకీమ్ ఆ ఆవును గుర్తించి గ్రామ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులకు తెలిపారు. రసాయన వ్యర్థాలు కలిసిన నీటిని తాగడంతోనే తన ఆవులు మృతి చెందాయని తెలిపారు. వారంలో అభిమన్యు అనే పాడిరైతుకు చెందిన మూడు ఆవులు, హకీమ్‌కు చెందిన రెండు ఆవులు మృతి చెందాయి. చెరువు, కుంటలను రసాయనాలతో కలుషితం చేసిన పరిశ్రమలే తమకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## నాసిరకం పనులపై ఆగ్రహం

బొల్లారం, ఆగస్టు 6: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని ఆరో వార్డు బాలాజీనగర్‌లో రెండు రోజుల క్రితం ప్రారంభమైన యూజీడీ నిర్మాణ పనుల్లో నాణ్యత లోపాలు ఉన్నాయని వార్డ్ కౌన్సిలర్ గుండ్ల సుజాతామహేందర్ రెడ్డి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలించారు. పనులను తక్షణమే నిలిపివేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. విషయం తెలుసుకున్న మేనేజర్ నిర్మల, ఏఈఈ కిష్టయ్య పనులను పర్యవేక్షించారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను పాటించేలా చర్యలు తీసుకుంటామని తెలపడంతో తిరిగి పనులను ప్రారంభించారు.

## సభ్యత్వ నమోదు

మునిపల్లి, ఆగస్టు 6: ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధించి ఎంఈవో, జేఎల్, డైట్ లెక్చరర్స్ పదోన్నతులు ఇప్పించేందుకు పీఆర్టీయూ కృషి చేస్తుందని సంఘం జిల్లా అధ్యక్షుడు గుండు లక్ష్మణ్ అన్నారు. మంగళవారం బుధేరా, పెద్ద గోపులారం, ఖమ్మంపల్లి, మునిపల్లి, అల్లాపూర్, హైద్లాపూర్, మల్లికార్జునపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు చేపట్టారు.

## కేసులపై ఆరా

జిన్నారం, ఆగస్టు 6: జిన్నారం పోలీస్ స్టేషన్‌ను అడిషనల్ ఎస్పీ సంజీవరావు మంగళవారం సందర్శించారు. సీఐ సుధీర్ కుమార్, ఎస్‌ఐ నాగలక్ష్మితో సమావేశమై కేసులపై ఆరా తీశారు.

# కాంగ్రెస్‌లో లుకలుకలు


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు జైపాల్ రెడ్డి, వరప్రసాద్ రెడ్డి

- ఆజ్యం పోసిన సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ
- ఎమ్మెల్యే వైఖరిపై సొంత పార్టీ నేతల అసహనం

బొల్లారం, ఆగస్టు 6: ఇటీవల పటాన్‌చెరు పట్టణంలో నిర్వహించిన సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ విషయంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి వైఖరిపై సొంత పార్టీకి చెందిన నాయకులే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో కాంగ్రెస్‌లో లుకలుకలు బయటపడ్డాయి. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఇతర పార్టీల నాయకులకు ప్రాధాన్యం కల్పిస్తూ లబ్ధిదారులకు చెక్కులు ఇవ్వడంపై బొల్లారం మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం కాంగ్రెస్ మున్సిపల్ శాఖ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, రాష్ట్ర కార్మిక నాయకుడు వరప్రసాద్ రెడ్డి విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి వ్యవహరిస్తున్న తీరుపై సొంత పార్టీకి చెందిన నాయకులే అసహనం వ్యక్తం చేశారు. చెక్కుల పంపిణీ విషయంలో ప్రొటోకాల్ పాటించాలని, లేనిపక్షంలో ప్రజల్లోకి రాంగ్ మెసేజ్ వెళ్తుందన్నారు. భవిష్యత్‌లో ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ఎమ్మెల్యేపై ఉందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు చంద్రయ్య, గోపాలమ్మ, మాజీ ఎంపీటీసీ కృష్ణంరాజు, కోఆప్షన్ సభ్యుడు మునీర్, నాయకులు రమణయ్య, రాజ్‌గోపాల్, చంద్రారెడ్డి, చక్రపాణి, వెంకటయ్య, అబ్దుల్ బషీర్ పాల్గొన్నారు.

# బోదకాలు నిర్మూలనకు చర్యలు


అవగాహన ర్యాలీలో డాక్టర్లు కల్పన, నేత్రావతి, కార్పొరేటర్ పుష్పానగేశ్

రామచంద్రాపురం, ఆగస్టు 6: బోదకాలు, నులిపురుగుల నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నామని ఆర్సీపురం పీహెచ్‌సీ డాక్టర్ కల్పన, కార్పొరేటర్లు పుష్పానగేశ్, సింధూఆదర్శ్ రెడ్డి అన్నారు. మంగళవారం జాతీయ పైలేరియా, నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఆర్సీపురం పీహెచ్‌సీ డాక్టర్ కల్పన ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. భారతీనగర్ డివిజన్‌లోని వార్డు కార్యాలయంలో వైద్య సిబ్బంది కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డితో కలిసి అవగాహన సదస్సు నిర్వహించారు. బోదకాలు, నులి పురుగుల నివారణకు ఈ నెల 10 నుంచి 25వ తేదీ వరకు మందు గోలీలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ నేత్రావతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# గండి చెరువు ఎఫ్‌టీఎల్ తగ్గించాలి

జిన్నారం, ఆగస్టు 6: ఖాజీపల్లి గండి చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిని పెంచడంతోనే పంట పొలాలు నీట మునుగుతున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం గ్రామంలో సమావేశమై గండి చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిని తగ్గిస్తేనే గ్రామానికి, రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. అనంతరం గ్రామ మాజీ సర్పంచ్ సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ భార్గవ్, నాయకులు, ప్రజలు గండి చెరువు పరిశీలించారు. కలెక్టర్, నీటిపారుదల శాఖ జిల్లా అధికారులను కలిసి చెరువు ఎఫ్‌టీఎల్‌ను తగ్గించాలని వినతి పత్రాన్ని అందజేయాలని నిర్ణయించారు. గండి చెరువు వద్ద గ్రామస్తులు, యువకులు ఎఫ్‌టీఎల్ తగ్గించాలని నినాదాలు చేశారు. అనంతరం ధరిమి చెరువును పరిశీలించారు. చెరువులోకి రసాయన వ్యర్థాలు రాకుండా నియంత్రించేందుకు చేపట్టాల్సిన చర్యలను అన్వేషించారు. కార్యక్రమంలో ఆకుల నవీన్ కుమార్, న్యాయవాది, పర్యావరణవేత్త దండే రమాకాంత్, సురేశ్, రాము, మహేశ్, కుమార్‌యాదవ్, గణేశ్, నరేశ్ పాల్గొన్నారు.

## రోడ్డు పనుల పరిశీలన

అమీన్‌పూర్, ఆగస్టు 6: రూ.15 కోట్లతో అమీన్‌పూర్ నుంచి వాణినగర్ వరకు నూతన రహదారి విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి తెలిపారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డితో కలిసి నిర్మాణ పనులను పరిశీలించారు. రహదారి నిర్మాణం పూర్తయితే రవాణా సౌకర్యం మెరుగవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కల్పన ఉపేందర్ రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు తలారి రాములు, కొల్లూరు యాదగిరి పాల్గొన్నారు.

# సొంత గూటికి మాజీ సర్పంచ్


మాజీ సర్పంచ్ శ్యామ్‌కుమార్‌కు కండువా కప్పి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే

కల్హేర్, ఆగస్టు 6: మండల పరిధిలోని రాపర్తి గ్రామ మాజీ సర్పంచ్ శ్యామ్‌కుమార్ బీజేపీని వీడి తిరిగి సొంత గూటికి చేరారు. ఈ మేరకు మంగళవారం నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో గులాబీ కండువా కప్పుకున్నారు. ఆయనతోపాటు మరో 100 మంది కార్యకర్తలు బీఆర్‌ఎస్ చేరారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి, కృష్ణమూర్తి ఉన్నారు.

**సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత**

కల్హేర్, ఆగస్టు 6: మండలంలోని మీర్‌ఖాన్‌పేటకు చెందిన నీరుడి మానెమ్మకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ రూ.27 వేల చెక్కును మంగళవారం మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి వారి ఇంటికి వెళ్లి అందజేశారు. మాజీ జడ్పీటీసీ నర్సింహారెడ్డి, కృష్ణారెడ్డి ఉన్నారు.

**బాధిత కుటుంబానికి పరామర్శ**

నాగల్‌గిద్ద, ఆగస్టు 6: ఇటీవల బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పండరి మాతృమూర్తి అనారోగ్యంతో మృతి చెందింది. మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి మంగళవారం వారి స్వగ్రహమైన వల్లూర్‌కి వెళ్లి పరామర్శించారు. గ్రామానికి చెందిన విఠల్‌గోండకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేశారు.

## ఎనిమిది వాహనాలు సీజ్

కోహీర్, ఆగస్టు 6: జహీరాబాద్ పట్టణంలోని 65వ జాతీయ రహదారిపై మంగళవారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మద్యం తాగి వాహనం నడిపిన ఆరుగురిపై కేసు నమోదు చేశారు. నంబర్ ప్లేట్ లేని ఎనిమిది వాహనాలను సీజ్ చేశారు. తనిఖీల్లో ఎస్సై కాశీనాథ్, షాడో పోలీసులు పాల్గొన్నారు.

## సమయపాలన పాటించాలి

కోహీర్, ఆగస్టు 6: మండలంలోని ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్న దాబాలను రాత్రి 11గంటల వరకు మూసివేయాలని ఎస్సై అరుణ్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం ఆయా గ్రామాల దాబాల నిర్వాహకులతో కోహీర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ దాబాల్లో మద్యం, మత్తు పదార్థాలను అనుమతించొద్దని సూచించారు.

## కుక్కలపై సర్వే చేయాలి

సిర్గాపూర్, ఆగస్టు 6: ప్రతి గ్రామంలో వీధి కుక్కలపై సర్వే జరపాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ జెస్సీ క్రాంతి తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. కుక్కలకు ఫ్యామిలీ ప్లానింగ్ చేసి దూరంగా వదిలిపెట్టనున్నట్లు తెలిపారు.

## విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

బొల్లారం, ఆగస్టు 6: మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1054 మంది విద్యార్థులకు పూర్ణ సాయి ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్ హైదరాబాద్ వారు ప్లేట్లను పంపిణీ చేశారు. సంస్థ చైర్మన్ ప్రవీణ్ హెచ్‌ఎం మంగీలాల్‌ను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

## ప్రజా సమస్యలపై ఆరా

బొల్లారం, ఆగస్టు 6: ప్రజా సమస్యలపై వచ్చిన ఫిర్యాదులకు స్పందించిన మున్సిపల్ కమిషనర్ మంగతాయారు మంగళవారం ఐదో వార్డ్ ఐడీఏ బస్తీలో పర్యటించారు. స్థానికంగా నెలకొన్న సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అబ్దుల్ బషీర్, బాలయ్య, చిట్టిబాబు, రాము, రాజు, రాంబాబు, మధు ఉన్నారు.

# పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం


అధికారులతో మాట్లాడుతున్న జిల్లా ప్రత్యేకాధికారి భారతి హోళికేరి, కలెక్టర్ వల్లూరు క్రాంతి, తదితరులు

సంగారెడ్డి కలెక్టరేట్, ఆగస్టు 6: ఇంటితోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచినప్పుడే ఆరోగ్యంగా ఉంటారని జిల్లా ప్రత్యేక అధికారి భారతి హోళికేరి అన్నారు. కలెక్టర్ వల్లూరు క్రాంతితో కలిసి మంగళవారం సంగారెడ్డిలోని 32వ వార్డులో పర్యటించారు. మంచి నీటి ట్యాంకును పరిశీలించారు. ట్యాంకును ఎన్ని రోజులకు ఒకసారి శుభ్రం చేస్తున్నారు? నీటిని పరీక్షిస్తున్నారా, లేదా? అని మున్సిపల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ ఇంట్లోని చెత్తను మున్సిపల్ వాహనాల్లో వేయాలని, ఆరుబయట వేయకూడదని సూచించారు. సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ మనోజ్‌కుమార్, జిల్లా పంచాయతీ అధికారి ఆయిబాబా, మాజీ సర్పంచ్ విజయేందర్ రెడ్డి, వార్డు కౌన్సిలర్ రామప్ప, మున్సిపల్ అధికారులు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన


తహసీల్ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న మాలపోరాట సమితి నాయకులు

అందోల్, ఆగస్టు 6: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల పోరాట సమితి ఆధ్వర్యంలో మంగళవారం జోగిపేటలో నిరసన చేపట్టారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసిన నాయకులు వర్గీకరణకు వ్యతిరేకంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్గీకరణ పేరుతో ఎస్సీలను విడదీయడం సరికాదన్నారు. వర్గీకరణను రద్దుచేసే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు మొగులయ్య, భాను, మహేశ్, మల్లేశం, భిక్షపతి, దీనబాంధవ్, ప్రసాద్, రాజు, హనుమంత్, పాండు, తదితరులు పాల్గొన్నారు.

## బియ్యం నిల్వల పరిశీలన


ఎంఎల్‌ఎస్ పాయింట్‌లో నిల్వలపై ఆరా తీస్తున్న ఆర్డీవో అశోక చక్రవర్తి

నారాయణఖేడ్, ఆగస్టు 6: మండలంలోని జూకల్‌లోని పౌర సరఫరాల ఎంఎల్‌ఎస్ పాయింట్‌ను మంగళవారం ఆర్డీవో అశోక చక్రవర్తి తనిఖీ చేశారు. రేషన్ డీలర్లకు పంపిణీ చేయాల్సిన బియ్యం నిల్వలను పరిశీలించారు. ఎలక్ట్రానిక్ యంత్రంతోనే తూకం వేసి డీలర్లకు సరఫరా చేయాలని సూచించారు. బియ్యం సరఫరాలో ఏమాత్రం లోటుపాట్లు జరిగినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా గోదాంలో పలు రికార్డులు, ఫైళ్లు, స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ భాస్కర్, ఆర్‌ఐ మాధవరెడ్డి ఉన్నారు.

# ప్రజా యుద్ధ నౌక గద్దర్‌కు ఘన నివాళి


*ప్రజా యుద్ధనౌక గద్దర్ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. గద్దర్ విగ్రహాలు, చిత్రపటాల వద్ద నివాళులర్పించి ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పాటలతో ప్రజల్లో పోరాట స్ఫూర్తిని రగిలించారని గుర్తుచేశారు. నేటి తరానికి గద్దర్ స్ఫూర్తిదాయకమన్నారు. ప్రజా సమస్యలపై పాటలు పాడి తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిలో నిలిచిపోయరన్నారు. గద్దర్ పాటలను నెమరు వేసుకున్నారు.*

*- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, ఆగస్టు 6*


రామచంద్రాపురం: తెల్లాపూర్‌లో గద్దర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కౌన్సిలర్ భరత్, తదితరులు


అందోల్: జోగిపేటలో నివాళులర్పిస్తున్న పలు పార్టీల నాయకులు


గుమ్మడిదల: నివాళులర్పిస్తున్న జానపద కళాకారులు


వట్‌పల్లి: గద్దర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

**PUBLIC NOTICE**

It is to inform general public that, Sri Appala Ramesh S/o Sri. Appala Lakshmi Narasimham approached my client Canara Bank, BHEL Branch for financial assistances. He intend to deposit the title deeds bearing document No 34504 of 2021 pertaining to the property, Residential house No 29-134/5131 [5131 MACH Society] constructed on plot bearing No 146, an area admeasuring 200 Sq Yds, Plinth area 720 Sft, in survey No's 137P, 138P, 139P, 151P, 152P, 154P & 900P, in Lay-out approved by HUDA Vide L.P. No 59/MP2/HUDA/05 Dt 04-02-2024, situated at Manmole Village, Ramchandrapuram Mandal, Sanga Reddy Dist.

Whereas he pleads link document pertaining to the said property, the parties APIIC Ltd (Vendor), Smt Vendra Naga Vishnu (Purchaser) sale deed document No 1538 of 2014, Dt 03-02-2014 registered in the office of the Dist-registrar, Sanga Reddy is lost.

If anybody has any objection, please contact the undersigned within 7 days from date of publication, with documentary proof and tenable evidence.

Sd/- **K. INDRASENA REDDY**
ADVOCATE
Plot No 35, Gummadi Venkat Reddy Colony, Alwal, Sec-bad-10, **Cell No 9052934447**

**Due On 23/08/2024**
Civ/SA/No. /2024
Date: /07/2024

**IN THE HIGH COURT OF JUDICATURE OF BOMBAY BENCH AT AURANGABAD CIVIL APPLICATION NO. 15336 OF 2016 IN SECOND APPEAL ST.NO. 12991 OF 2016**

Mahabuddin, S/o. Mehatasab
**...Applicant**
VERSUS
Kishanrao, S/o. Rachappa Bhalke died Thr. LR's Shivkumar, S/o. Kishanrao Bhalke and Others
**...Respondents**

**To**
**R.NO. 3.: Vishawanat, S/o. Rachappa Bhalke, Age: 68 years, Occu: Agriculture, Resident of Zahirabad, District - Medak (A.P.)**

WHEREAS the Appellants above named has presented a Appeal to this Court, praying for reliefs and whereas the same has been registered in this Court as Civil Application, the Court has ordered on 28/06/2024 Notice to issue, take notice that hearing of the said Application will take place on **23/08/2024** if no appearance is made on your behalf either in person or by an Advocate of this Court or an Agent duly authorised and instructed by you, it will be heard and determined in your absence.

WITNESS **SHRI DEVENDRA KUMAR UPADHYAYA** THE CHIEF JUSTICE AT BOMBAY AFORESAID THIS 28th JUNE TWO THOUSAND TWENTY FOUR.

**BY THE COURT**
**Sd/- ASSISTANT REGISTRAR**